14

# డోలు

నీలి ఆకాశమ్మీద పక్షులు ఎగురుతున్నాయి. చల్లగాలికి పచ్చని పైర్లన్నీ వూగుతున్నాయి. నల్లని రోడ్డు నగరంవైపు పరుగెడుతోంది. నగరంలో కూడలి రద్దీగా గోలగా వుంది. కూడలి నుండి కుడివైపు రోడ్డు తిరిగి వేగంగా వెళ్ళిపోతే, నిలబెట్టిన సిమెంటుడబ్బాల్లాగా భవనాలు చకచకా వెనక్కి పరుగెడుతాయి. ఒక ఫర్లాంగు దాటాక, ఎడమ వైపు ఒక పెద్ద గేటు ! గేట్లోకి ప్రవేశించగానే- పూలతోట్లు, లాన్లు, అశోకావృక్షాలు, యూకలిప్టస్ చెట్లు.... చల్లని నీడలో ఆ భవనం 'కళానిలయం!!' లోపలి నుండి- మైకులో కొన్ని మాటలు వినిపిస్తున్నాయి. కొందరు త్వరత్వరగా లోనికి పోతున్నారు.

'ఈ ఆకాశం ఆకాశాన్నే తరిగేస్తాను వంకాయల్లా. పచ్చని ఆకులమీద నా అను 'బూతులు' రాస్తాను మంచు బిందువులవలె ఉదయాన్నే-'

మాటలు అస్పష్టమైపోయి, సన్నబడి, చిన్నగా డోలు వాయిద్యం మొదలయ్యింది. ఒక పెద్దమనిషి ఎవరినీ పట్టించుకోకుండా నింపాదిగా కళ్ళు మూసుకుని, లయబద్ధంగా తల ఆడిస్తూ చెవిని అగ్గి పుల్లతో కెలుక్కుంటున్నాడు. చెవి వైపు మడిచిన కుడిచెయ్యి త్రిభుజాకారపు సందులోంచి చూస్తే, అతని ముందు యింకాయింకా పదులు, యాభైలు, వందల తలలు.... ఆడతలలు, మగతలలు.... కంకరరాళ్ళ మీద డాంబరు పోసినట్టు నల్లతలలు.

తలల వరుసలన్నీ ఆఖరయ్యాక, ఎక్కే మెట్లు- ఫ్లడ్‌లైట్లు- రంగస్థలం- పరదాలు- మైకులు,

రంగస్థలం మీద రెండుకాళ్ళు!! కాళ్లు ఎగురుతున్నాయి.

గజ్జెల ఝునక్ ఝునక్, ఝునక్ కళాకారుడు అంగలు వేస్తూ, మెడలో వున్న డోలు వాయిస్తున్నాడు. డోలు శబ్దం పెద్దదైంది. ఢంఢ ఢంఢం- ఢంఢ ఢంఢం, ఝునక్ ఝునక్ ఢంఢ ఢంఢం....

టిమ్- టిమ్ టిమ్- ట్యూమ్.... కళాకారుడి పక్కనే మరో మైకు ముందు ఓ స్త్రీ గిటారు వాయిస్తోంది. కొందరు గబగబా బయటకు పారిపొయ్యారు.

వ్యాఖ్యాత గొంతు: "ఎందరో ప్రముఖులు పాల్గొన్న ఈ మేళనం అనంతంగా సాగింది. ఈ కార్యక్రమాలు రాజధానీ నగరంలో రెండ్రోజులపాటు జరిగాయి. గ్రామకవి, తాలూకా కవి, జిల్లాకవి, బాలకవి, వృద్ధకవి, చలనకవి, స్థానకవి, సంక్షోభకవి లాంటి ఎందరో ప్రసిద్ధులు పాల్గొన్నారు. కలియుగకవి తమ జీవితంలోని అనుభవాలు, ప్రయోగాలు, స్వీయ కవిత్వం ద్వారా తెలియ జేశారు. వారి సతీమణి దానిని ఆంగ్లంలోకి అనువదిస్తూ వచ్చారు"

కొట్టొచ్చినట్టు పెద్దడోలు. దానిమీద కలియుగకవి చేతివేళ్ళు చాలా జోరుగా పనిచేస్తున్నాయి. కళాకౌశలం బయట పడుతోంది.... గిటారు తీగెలమీద నాజూకైన వేళ్ళు. వెనక పరదాల మీద బ్యానర్, బ్యానర్ మీద "ఉగాది కవిసమ్మేళనం" అని అక్షరాలు. గాలికి పరదాలు కదులుతున్నాయి.

స్టేజీ ముందు వరుసలో పెద్ద ముఖాలు, బట్టతలలు. తలల్లో కొన్ని కొన్ని కలుసుకుంటున్నాయి. విడిపోతున్నాయి. రెండు, మూడు వరుసలలో పట్టు వస్త్రాలు, నగలు జిగేలు మంటున్నాయి. స్త్రీలు ఒకరి బట్టలగూర్చి ఒకరు అడిగి తెలుసుకుంటున్నట్లుంది. కొందరి- అందం పగిలి పోయినట్లున్న నవ్వు.... డోలుకు జోడైంది-

వ్యాఖ్యాత గొంతు: "యూనివర్సిటీలు, అకాడమీలు పాల్గొన్న సమ్మేళనంలో ఎక్కువ మంది రచయిత్రులు పాల్గొనడం విశేషం.

మహిళలు ముందుకు వస్తున్నారనడానికి నిదర్శనం...."

దేరా గాలికి వూగుతోంది. 'స్వాగతం' బ్యానర్ వూగివూగి పడి తిరిగింది. కేవలం 'గతం' అన్న అక్షరాలు కనిపిస్తున్నాయి. మధ్యలో లేచిపొయ్యే వాళ్ళు- టైం చూసుకుంటూ ఎంతో ఆతురతతో హాల్లోకొస్తున్న వాళ్లూ....

ప్రేక్షకుల్లో ఒక పసిపాప ఏడుపు లంకించుకుంది. చాలా తలలు అటువైపు తిరిగాయి. తల్లి ఆడిస్తొంది. సముదాయిస్తోంది. డోలు చప్పుడు సన్నగా వినిపిస్తొంది. పిల్ల ఏడుపు చుట్టుపక్కల వాళ్ళ చెవులు పగలగొడుతోంది. ఆ ఏడుపు శబ్దంలోంచి సన్నగా నినాదాలు మొదలయ్యాయి. క్రమంగా ఏడుపు శబ్దంతగ్గి, నినాదాలు తీవ్రంగా వినిపిస్తున్నాయ్.

"ఆపాలీ! ఆపాలీ!!

డోలు వాయిద్యాలాపాలి.

పోవాలీ! పోవాలీ!

గుడంబా సాహిత్యం- పోవాలి...."

నరాలు బిగబట్టిన గొంతులు పిడికిళ్ళతో వూగుతున్న చేతులు. ఉద్రేకపు శరీరాలు.

వ్యాఖ్యాతః "కవితా గానాన్ని డోలు వాయిద్యంగా పరిగణించి కార్యక్రమానికి అంతరాయం కలగజేయాలనుకున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.... 'రాజకీయ ఉపన్యాసం లాగా కవిత్వం ప్రజల దాకా రాదు. ప్రజలే కవిత్వాన్ని వెతుక్కుంటూపోవాలి. కవితాదర్శన లేని ప్రేక్షకులకు కవిత్వం అర్థంకాదు. వాళ్ళకు ఏదో వాయిద్యం విన్నట్లుగా అనిపించడం సహజమే'- అని కలియుగకవి అభిప్రాయ పడుతున్నారు"- కలియుగకవి కవిత్వం మళ్ళీ వినిపిస్తుంది.

'కడుపులో దాచుకోబోయే ముందు

ఈ ప్రపంచాన్నే అందమైన గులాబీరంగు
కాప్సూల్‌ని చేస్తాను....'- క్రమంగా మాటలు వినిపించకుండా పోయి, డోలు శబ్దం వినిపిస్తుంది. ఢండం-ఢం! ఢండం- ఢం!! డోలు చప్పుడు మంద్రస్థాయి నుండి, తీవ్ర స్థాయికి చేరింది. డేరా ఎగిరెగిరి పడుతోంది. ప్రేక్షకులు నలుగురికో గుంపు చొప్పున మూట తొంభయ్యారు గ్రూపులయ్యారు.

ఒక బట్టతల ప్రేక్షకుడు ఓపిగ్గా అందర్నీ పరిశీలిస్తున్నాడు. చూసీచూసీ పక్కన కూర్చున్నతనితో అన్నాడు.

ప్రేక్షకుడి గొంతు: "అంతా పిక్‌నిక్-కు వచ్చిన వాళ్ళలాగా వున్నారు మగవాళ్ళు- ఆ స్టేజీమీద వున్న స్త్రీ కష్టపడి గిటారు వాయిస్తోంది. డోలు వాయిద్యంలో కవిత్వం వుందని ఆంగ్లంలో చెబుతోంది కాబోలు.... హిహ్హిహి.... (నవ్వు) ఇటు ఈ ఆడ విప్లవ ప్రేక్షకులు పేరంటానికి వచ్చిన వాళ్ళలాగా వున్నారు. ఒకరి గుసగుసలు ఒకరికి వినిపిస్తున్నట్టు లేవు. వేళ్ళు విరుచుకోవడాలు, పెదాల విరుపులు, అసూయచూపులు.... స్టేజీమీద ఇంకా ఎంతసేపో ఆ కవిగాడి స్వీయ కవిత్వం- అబ్బా.... హాఁ" (ఆవులింత).

ఢంఢం- ఢం! ఢంఢం- ఢం!! రంగస్థలంమ్మీద కళాకారుడు. డప్పువాయిద్యానికే జీవితం అంకితం చేసుకున్న వాడిలాగా, ఆ కళాకారుడి ముఖంనిండా ప్రసన్నత, త్యాగం, కృషి కలగాపులగంగా చోటు చేసుకుంటున్నాయి. కలియుగ కవిలాంటి యింకొంతమంది కవులు 'సెహభాష్'- అంటూ తాళం వేస్తున్నారు.

ఫ్లడ్‌లైట్లు, దిగేమెట్లు, దాటేసి ఇంకా వెనక్కి చూస్తే, నల్లని తలలు, కంకర రాళ్ళమీద డాంబరు పోసినట్టు తలలు, తలల చివర ....చెవిలో పుల్లతో ముసలాడు.

డోలు వాయిద్యపు అపస్వరాలు సన్నగా వినిపిస్తున్నాయి. చాలా మంది అసహనంగా- లేవడానికి కదులుతున్నట్లుంది.

బట్టతల ప్రేక్షకుడు, కక్కొస్తున్న వాడిలాగా ఆ హాల్లోంచి గాబరాగా బయటపడి, రెండు మూడడుగుల్లో వరండా దాటి బయటకు వెళ్ళిపొయ్యే గుమ్మంలో నిలబడ్డాడు. అక్కడ-కొంత స్థిమిత పడ్డాడు. బయట పార్క్ చేసివున్న వాహనాలు కనిపించాయి. రెండుకార్ల మధ్య ఒక నల్లకుక్క విశ్రాంతిగా కూచుని మొరుగుతోంది....

'భౌభౌ- భౌ-.... భౌభౌ- భౌ'........

'ఢండం- ఢం... ఢండం-ఢం.' 'భౌభౌ- భౌ...అతని ముఖం మీద సంతోషం వికసించి, పూసినట్లు- చిన్న నవ్వు.

నాగరికమైన అందంలా పెంచిన చెట్ల పక్కనుండి, పచ్చని లాన్ల మధ్యగుండా కదిలి కళానిలయం కాంపౌండు దాటితే- అక్రమ సంపాదనల్లా, ఇనప్పెట్టెల్లా సిమెంటు భవనాలు! వాటి మధ్య నలిగి నలిగి పోతున్న సగటుమనిషి బ్రతుకులా తార్రోడ్డు. తార్రోడ్డుమీద సమస్యల ట్రాఫిక్. సమస్యలన్నీ కేంద్రీకృతమై సంకీర్ణమైన జీవితం కూడలి. కూడలిలో ఎప్పుడో చచ్చిపోయిన ఒక దేశనాయకుడి విగ్రహం- విగ్రహం నీడలో విశ్రమిస్తున్న అనాధలు. అనాధలు గాలికి రోడ్డుమీద కదులుతూ వుండే చిత్తు కాగితాలు.

కూడలి దాటాక కొద్దిదూరంలో- పదేళ్ళ కుర్రాడు ఫుట్‌పాత్ మీద బూటుపాలిష్ చేస్తున్నాడు. ఫుట్‌పాత్‌కు కొద్ది దూరంలో పైకి చూస్తే ఖరీదైన హోటల్లో నీలినీలి అద్దాల వెనక పరదాలు కదులుతున్నాయి. అక్కడి నుండి అరమైలు పొడుగునా కార్మికుల అసంతృప్తి! నినాదాల శబ్దంలో- ఊరేగింపు రూపంలో-

బయటపడి ముందుకు పోతే, ఇరానీ హోటళ్ళు, మెడికల్ షాపులు, బట్టలకొట్లు, బార్లు, కిరాణా దుకాణాలు, ఆఫీసుల్లు, కిరాయి యిండ్లు, ధర్మాసు పత్రులు!! మున్సిపాలిటీ తోటలు, స్కూటర్ రిపేరింగ్ వర్క్‌షాపులు, పోలీసు స్టేషను!!

అలాగే వేగంగా మూడుమైళ్లు నగరాన్ని దాటేస్తే- చల్లగాలి!! ప్రాణవాయువు. పచ్చని పొలాలు. చావుకు సిద్ధమై కూడా ఇంకా రోడ్డుమీది పేదకోసం ఆత్రంగా అడుగులు వేస్తున్న ముసలమ్మ. మొక్కలకు కావల్సిన రక్తంలా పారుతున్న పంటకాలవలు. చెమటతో పొలం తడుపుతున్న మట్టిమనుషులు. గట్టుమీద నిలబడి వాళ్ళను గదమాయిస్తూ, అమ్మనీ ఆలినీ బూతులు తిడుతున్న ఆ ఊరి మోతుబరి.

గుండెలోంచి బతుకుపాట పాడుకుంటూ పశువుల్ని కాసే పోరడు రోడ్డు పక్కన, కమ్మకత్తితో తుమ్మకాయ తెంపుతున్నాడు. నల్లనిరోడ్డు నగరం నుండి పరిగెత్తి వచ్చింది. చల్లగాలికి పైర్లన్నీ వూగుతున్నాయి. నీలి ఆకాశం మీద పక్షులు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. ○

అరుణతార

జూన్-ఆగష్టు 1979